


# (అ)సత్యమేవజయతే

సత్యం డిగ్రీ పూర్తిచేసుకుని ఉద్యోగ ప్రయత్నంలో పట్నం ప్రయాణమయ్యాడు. తండ్రి ఊర్లో ప్రైమరీ స్కూలు టీచరు. చిన్నతనంలోనే సత్యం గాంధీగారి సూత్రాల్ని, ఆయన ఆశయాల్ని తండ్రి బోధనలద్వారా వంటపట్టించుకుని, గాంధీగారి ఆటోబయోగ్రఫీని, ఆయన ఇతర రచనల్ని చాలా ఆసక్తితో చదివి ఆయన వ్యక్తిత్వాన్ని పూర్తిగా అవగాహన చేసుకుని అర్థం చేసుకున్నాడు.

నిరుద్యోగిగా ఎంతకాలం తండ్రి సంపాదనమీద బతకడం? ఏదో ఒక చిన్న ఉద్యోగమయినా సంపాదించి కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ఉద్యోగం వేటలో పట్నానికి బయలుదేరాడు. పట్నంలో ఒక స్నేహితుడి 'రూమ్'లో స్థానం సంపాదించాడు. ఉద్యోగం దొరికాక అద్దెలో కొంత భాగం భరించే ఒప్పందంతో సత్యంకి ఆ స్నేహితుడు 'రూమ్'లో స్థానం ఇచ్చాడు.

ఈ 'సాఫ్ట్‌వేర్' యుగంలో, సంవత్సరానికి దాదాపు లక్షమంది ఇంజీనర్లు తయారవుతున్న ఈ రోజుల్లో, సాధారణ డిగ్రీ పాసయిన సత్యానికి ఉద్యోగం దొరకడమంటే మాటలా? ఎటుచూసినా విపరీతమయిన పోటీ. తన డిగ్రీ సర్టిఫికేట్ దుమ్ముదులిపి మొదటిరోజు ఉద్యోగ ప్రయత్నం ప్రారంభించాడు సత్యం.

మొదటిరోజు ఇంటర్వ్యూలో 'అనుభవం ఉందా? ఇన్నాళ్ళూ ఖాళీగా ఎందుకున్నావు?' మొదలైన ఇంటర్వ్యూబోర్డ్ ప్రశ్నలకు, ఉద్యోగం ఇవ్వనిదే పనిచేసే అవకాశం, అనుభవం ఎక్కడనుండి వస్తుంది? అన్న సమాధానం ఇవ్వడంవలన, మరో ఉద్యోగ ప్రయత్నం తప్పలేదు సత్యానికి.

చివరికి ఏదో ఒక చిన్న కంపెనీలో 'ఆల్ ఇన్ వన్' ఉద్యోగం ఒకటి సంపాదించాడు. అంటే అకౌంటెంట్ నుండి ఫ్యూన్ వరకూ అన్నీ తనే. తనతోపాటు ఆ ఆఫీసులో మరో అయిదుగురు సహోద్యోగులు మాత్రమే ఉన్నారు. నెలకి అయిదువేల రూపాయలు జీతం. పొట్ట గడవడానికి, అద్దెలో తనవంతు భాగం చెల్లించడానికి, బస్సు ఖర్చులకి మాత్రమే సరిపడే చాలీచాలని జీతం. ఇక తల్లిదండ్రులకి, చెల్లెలు పెళ్ళికి తను సహాయపడే అవకాశం శూన్యం. మొత్తంమీద సత్యం ఉద్యోగ పర్వం ప్రారంభమయింది.

ఆఫీసులో పరిస్థితి చూస్తే విచిత్రంగా ఉండేది. విదేశాల్లో చదువులకి, ఉద్యోగాలకి ఎగబడే వారికి 'పాస్‌పోర్టులు', 'వీసా'లు ఏర్పాటు చేసే ఆఫీసు. రకరకాల మనుషులు వస్తూ పోతూంటారు. ఏవో లావాదేవీలు జరుగుతూంటాయి.

కంపెనీ యజమాని ఎవడో తెలీదు. ఆఫీసులో గోడకి మాత్రం గాంధీగారి ఫోటో దానిక్రింద 'బోల్డ్ లెటర్స్'లో 'ఎల్లప్పుడూ సత్యమునే పలుకవలెను' అన్న వాక్యం చదువుతుంటే సత్యానికి నవ్వొచ్చింది. ఉదయం లేచిన దగ్గర నుండి రాత్రి పడుకునే వరకు మన నిత్య జీవితంలో అనేక అబద్ధాలు అవసరమున్నా లేకున్నా సులువుగా చెప్పేస్తూంటాము.

ఈనాడు సెల్‌ఫోను సంస్కృతి పెరిగాక అబద్ధాలు పెచ్చుపెరిగిపోయాయి. రైల్లో ప్రయాణం చేస్తూ ఆఫీసులో ఉన్నాననో లేదా ఆఫీసులో ఉంటూ రైలు ప్రయాణం చేస్తున్నానో చెప్పడం పరిపాటైపోయింది.

ప్రక్కింటి వాళ్ళని ఏదో అవసరమొచ్చి డబ్బు బదులడిగితే సహాయం చేయగల స్తోమత ఉన్నా, 'నిజం చెబితే నమ్మరు గానీ ఇంట్లో ఒక్కపైసా లేదండీ! మొన్ననే మా అబ్బాయి కాలేజీ ఫీజు కట్టాను. మా అత్తగారి వైద్యానికి కొంత సహాయం చేయవలసి వచ్చింది. చేతిలో చిల్లిగవ్వలేదంటే నమ్మండి!' ఇలా అబద్ధాలు నోటికొచ్చినట్లు చెబుతూంటారు కొందరు.

ఆఫీసుకెందుకాలస్యమయిందని బాస్ ప్రశ్నిస్తే ట్రాఫిక్ జామ్ అయిందనో, పిల్లాడి కాలేజీకి వెళ్ళి వచ్చినందుకు ఆలస్యమయిందనో, దారిలో స్కూటర్ ట్రబుల్ ఇచ్చిం

**ఆదిమధ్యం రామానుజస్వామి**

దనో 'స్టాఫ్' చెప్పే అబద్ధాలు తరచూ వింటూనే వుంటాడు సత్యం. నిజానికి సమయాన్ని పాటించడానికి బద్ధకం.

'ఆఫీసుకి ఆలస్యంగా వెళితే కొంపలేమీ మునగవులే!' అన్న ధీమా. ఇలాంటి బద్ధకం, ధీమా జపాన్ ప్రజలలో ఉండి ఉంటే, రెండవ ప్రపంచయుద్ధం తరువాత అతి తక్కువకాలంలో అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరి ఉండేదా? 'ఎల్లవేళలా సత్యమునే పలుకవలెను' అన్న గాంధీగారి సూక్తిని నేటి జనం పూర్తిగా మరచి 'ఎల్లప్పుడూ అవసరానికి అసత్యమునే పలుకవలెను' అని మార్చుకుని పాటిస్తున్నారు.

విదేశాల్లో ఉన్న ఒక పెద్ద కంపెనీలో ఉద్యోగాలకై వెళ్ళే వారికి 'వీసా'లు ఏర్పాటు విషయంలో ఏవో వివాదాలు వచ్చి, తనిఖీకై వచ్చిన ప్రభుత్వాధికారులకు అబద్ధం చెప్పడం చేతకాక, కంపెనీకి సంబంధించిన కొన్ని నిజాలను చెప్పడంవలన, సత్యాన్ని 'బాస్' ఉద్యోగంలో నుండి తీసేశాడు. సత్యం తిరిగి రోడ్డునపడ్డాడు. వేరే ఉద్యోగానికై ప్రయత్నాలు మొదలుపెట్టాడు.

❖ ❖ ❖

సత్యం న్యూస్‌పేపరు తిరగేస్తూ మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. గాంధీగారి అహింసా సూత్రాల్ని జనం పూర్తిగా మరచిపోయారు. నేడు నిత్యజీవితంలో రోజూ ఎటు చూసినా హింసే. న్యూస్ పేపరు తిరగేసినా, 'టీవీ' ఆన్ చేసినా 'ఆస్తికై తండ్రిని చంపిన తనయుడు', 'భార్యాపిల్లల్ని చంపి ఆత్మహత్య చేసుకున్న భర్త', 'ఆడపిల్లపై ఆసిడ్ జల్లిన ప్రేమోన్మాది' ప్రతి చిన్నవిషయానికి కక్షలు, కార్పణ్యాలు, తన్నులాటలూ, తోపులాటలూ రోజూ చూస్తున్నాం, వింటున్నాం. అహింస అనేదే ఎక్కడా కానరావడం లేదు.

కొంత ప్రశాంతతకోసం సత్యం దేవాలయానికి బయలుదేరాడు. అక్కడికి వచ్చిన వాళ్ళు శాంతి, సహనాన్ని పాటిస్తున్నట్లు కనబడ్డంలేదు. శాంతి సహనం పాటిస్తున్న అమాయకులు కొందరే. ఉదయం లేచింది మొదలు అన్ని పనులూ అసహనంగానే చేసుకుపోతుంటారు. పోనీ ఏదో కొంత ప్రశాంతతకని దేవాలయానికి పోతే అక్కడ సొమ్ముచెల్లించి చేసుకునే ప్రత్యేక దర్శనాలు, 'క్యూ'లో తోపులాటలు, ఏదో అసహనం.

దేవుడ్ని స్థిమితంగా దర్శించుకుని, మనసులో ప్రార్థించుకునే సహనం ఓపిక జనంలో ఎక్కడా కనబడటంలేదు. చెప్పులు దేవాలయం బయట విడుస్తారు. దేవుడి దర్శనంమీదకంటే బయట వదలిన చెప్పులమీదే ధ్యాస. ఎవడెత్తుకుపోతాడోనన్న అనుమానం. ఇక దేవాలయానికి వచ్చి సెల్లుల్లో సొల్లు సంభాషణలు.

ఆరోజు న్యూస్ పేపరులో వచ్చిన వార్తావిశేషాలపై దృష్టిమరలించాడు సత్యం. స్త్రీ స్వాతంత్ర్యం, స్త్రీ స్వేచ్ఛ. దశాబ్దాలు గడచినా మహిళాబిల్లుకి మోక్షంలేదు. స్త్రీ పురోగతిని మౌనంగానే వ్యతిరేకిస్తుంటారు నాయకులు. అర్ధరాత్రి స్వేచ్ఛగా ఆడది తిరగగలిగితే స్వాతంత్ర్య వచ్చినట్లే! కానీ ఆడది అర్ధరాత్రి ఒంటరిగా స్వేచ్ఛగా తిరిగితే... చట్టం చేతుల్లోనే బలయ్యే ప్రమాదం. గాంధీగారు విదేశీ బట్టలను విస్మరిస్తే, స్త్రీల బట్టలనూడ దీస్తున్నారు నేడు.

మద్యపాన నిషేధం కాదు. మద్యపానాదరణ. మద్యపానం ప్రభుత్వ ఖజానాకు ధనాన్ని సమకూర్చే మంచి సాధనం. ఎన్నికల్లో ఏరులైపారి అధికారాన్ని కట్టబెట్టే అమూల్య సాధనం. అవినీతికి, అక్రమ సంపాదనకి, భూకబ్జా కింగ్‌లకి అర్ధరాత్రి అనైతిక ఒప్పందానికి ముడి సరుకు. 'గాంధీ!' అనరా అంటే 'బ్రాందీ!' అంటున్న రోజులు. మద్యపాన నిషేధం కల్లే. మనిషి అనారోగ్యానికి మద్యపానమే హేతువు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకి ఆదాయ మార్గం. బ్రిటిష్ వారిని మనదేశం నుండి తరిమికొట్టిన గాంధీ గారి సూత్రాలు సిద్ధాంతాలు, స్వదేశీయుల చేతిలో ఎందుకు చిత్తయిపోతున్నాయో?

సత్యం నిరుద్యోగి. గాంధీగారి సూత్రాల్ని మనసావాచా నమ్మాడు. నేటి పరిస్థితులు అనుకూలంగా లేనప్పటికీ, సత్యం జీవించదలచుకున్నాడు. ఎప్పటికయినా సత్యం జయించే రోజులొస్తాయన్న నమ్మకంతో. భావితరాలు గాంధీగారి సిద్ధాంతాలను, ఆశయాలను సిద్ధింపజేసే రోజు వస్తుందన్న ఆశతో.

సత్యం ఆకలితో నేటి సత్యాన్ని గ్రహించి సత్యాగ్రహాన్నే నమ్ముకుని ఎప్పటికయినా తిరిగి మంచి రోజులు, స్వర్ణయుగాలు రాకపోతాయా? అని భావిస్తూ ఒక మంచి ఉద్యోగం సంపాదించి ఎప్పటికయినా తన కుటుంబాన్ని ఆదుకోగలనన్న ఆశతో రూమ్ చేరి విశ్రమించాడు. ✻

## గజల్

వాడిపోయిన ఊహలన్ని
రాల్చుకుంటే సంబరం
హృదయమందున చైతన్యం
నిలుపుకుంటే సంబరం
సారంలేని వాదనలే
వీడకుంటే తగదోయి
మంచి తలంచి కాసింతా
సర్దుకుంటే సంబరం
ఆజ్ఞాపించు పెద్దరికం
అన్నివేళల ఒప్పునా!
ఆత్మీయతను ఒలికె చెలిమి
పంచుకుంటే సంబరం
అందగత్తెలు అలకబూని
ముడుచుకున్నా మురిపమే
కొత్తసిగ్గులు తొడిగెనంటు
నవ్వుకుంటే సంబరం
బాల్యంలోకి తొంగిచూస్తే
మనసుకెంతో హాయిలే
బాలలతోడ గంతులేసి
ఆడుకుంటే సంబరం
భార్య ఒలికే చిరునవ్వులు
భర్తమదికే బహుమతులు
నవ్వుమాటున భావాలను
తెలుసుకుంటే సంబరం
మంచితనమే సంతృప్తిని
పంచిపెట్టును ఇలలోన
సేవలుచేసి సమాజాన్ని
ఆదుకుంటే సంబరం
ఈర్ష్యయుంటే మనిషి హృదయం
అగ్నిగుండం నరేంద్రా!
పరుల జయమును మనసారా
కోరుకుంటే సంబరం

ద్యావరి నరేందర్ రెడ్డి